క్లుప్తంగా

వేడుకగా సీతారాముల కల్యాణోత్సవ రాట



అక్కిరెడ్డిపాలెంలో సీతారామాలయం వద్ద రాట వేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ సీతారాముల కల్యాణ పందిరి రాట మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని సీతారామాలయం ఎదుట గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు రాట ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కామాడ రాంబాబు, బొడ్డు రమణ, రాజు, బొడ్డు గోపాలరావు, అంగ శ్రీను, అప్పల స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని పారంభిస్తున్న సోమశేఖర్

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడికి చెందిన మహాత్మా గాంధీ సేవా సంఘం 9వ వార్షికోత్సవం సందర్భంగా అగనంపూడి సత్రం కూడలిలో బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అగనంపూడికి చెందిన నాయకుడు గవర సోమశేఖర్ ఉగాది సందర్భంగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ సేవా సంఘం పేరుతో చిత్తా రామారావు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ముత్యాల అప్పారావు, సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, గవర నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం నేడు

పెదగంట్యాడ: ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 23న గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో చర్మ వ్యాధి నిపుణులు, స్త్రీలు, గర్భిణులు, గర్భకోశ వ్యాధి నిపుణులు, దంత వైద్య నిపుణులు, ప్రత్యేక పిల్లల వైద్య నిపుణులు, సాధారణ, కీళ్ల, ఎముకలు వైద్య నిపుణులు సేవలందించనున్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేయనున్నారు. అలాగే బీపీ, షుగర్, రక్త పరీక్షలను ఉచితంగా చేయనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీపీసీ యాజమాన్య ప్రతినిధులు కోరారు.

సింహగిరికి ఉగాది శోభ



పుష్పాలంకరణలో అప్పన్న ఆలయం

సింహాచలం: సింహగిరి బుధవారం ఉగాది శోభను సంతరించుకుంది. శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని భక్తులు సింహగిరికి పోటెత్తారు. క్యూలో బారులు తీరి వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఉగాది సందర్భంగా స్వామివారి ఆలయంతో పాటు ఆస్థానమండపం..కల్యాణమండపాన్ని పుష్పాలతో అలంకరించారు. అలాగే భక్తులందరికీ దర్శనానంతరం ఉగాది పచ్చడి అందజేశారు. సింహగిరిపై ఉన్న త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగింది.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని పెద్దవాల్తేరుకు చెందిన పేరి రామ భాస్కరరావు అనేదాత లక్ష 1116 రూపాయిల విరాళం ఇచ్చారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో పీఆర్వో నాయుడుకు అందజేశారు.

లోగిళ్లు 'శోభా'యమానం

ఉగాది వేళ తెలుగు వారి లోగిళ్లు కళకళలాడాయి. కొత్త సంవత్సరం అందరికీ శోభాయమానంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శోభకృత్ నామ సంవత్సరానికి ప్రజలు సాదర స్వాగతం పలికారు. కొత్త వస్త్రాలను ధరించి, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని స్వీకరించారు. అందరికీ మంచి జరగాలని కోరుతూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

- ఘనంగా శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



తుంగ్లాంలోని కోదండ రామాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో..

పెదగంట్యాడ: తెలుగు సంవత్సరాది వేడుకలను మండలంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, రాజాన రామారావు, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, మస్తానప్ప, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

- వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహిళలు ధ్వజస్తంభం, తులసి కోట వద్ద దీపారాధన చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.
- 76వ వార్డు నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పంచాంగ శ్రవణం చేశారు.
- హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో గల కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బ్రహ్మర్షి వేమకోటి శ్రీనివాస్‌శర్మ పంచాంగాన్ని పఠించారు.
- 65వ వార్డు వాంబేకాలనీలోని దేవపర్వతంపై వేంచేసియున్న దుర్గాదేవిని ఎమ్మెల్యే నాగిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్న వేంకటేశ్వరాలయం, 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని రామాలయం, 69వ వార్డు తుంగ్లాంలోని కోదండ రామాలయాలు భక్తులతో కళకళలాడాయి. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి సీతా కోదండ లక్ష్మణ స్వాములను దర్శించుకున్నారు.

ఉక్కు నగరానికి ఉగాది శోభ

ఉక్కునగరం: ఉగాది వేడుకలను ఉక్కునగరంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా, కళాక్షేత్రాలు ఉగాది పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలతో కళకళలాడాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ, అర్చకులు హరి నారాయణ, సత్యనారాయణ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేశారు. భాస్కరభట్ల సత్య ప్రసాదశర్మ పంచాంగ పఠనం చేశారు. అయ్యప్పస్వామి ఆలయంలో ప్రధానార్చకులు నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, అయ్యప్పకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

- త్రిశక్తి ఆలయంలో శ్రీమహాలక్ష్మి, శ్రీమహాదుర్గా, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు పంచామృత సహిత నవరసాభిషేకాలు చేశారు. అనంతరం చందనాలంకరణ చేసి, సహస్ర పుష్పార్చన చేశారు. భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం నవచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వాడవాడలా ఉగాది సందడి

గాజువాక: కేఎన్నార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం గ్రంథాన్ని ఆ సంస్థ చైర్మన్ కరణం రెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. స్థానిక నాయకులు పేర్ల సత్యారావు, కె.అప్పలరాజు, శ్రీనివాసరావు, వి.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

- కొత్తగాజువాక సంజీవగిరి కాలనీలో పండిట్ ఆర్వీఆర్ఎస్ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఆయనకు కాలనీ పెద్దలు మద్దాల అప్పారావు చేతులమీదుగా సత్కారం చేశారు. కార్యక్రమంలో ఎం.లోకనాథరావు, నాగిశెట్టి శ్రీను, సత్తిబాబు, స్వామినాయుడు, సలాది రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ఉక్కు వేంకటేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం



ప్రసాదశర్మను సత్కరిస్తున్న సంజీవగిరి కాలనీ పెద్దలు

ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు దుర్భరం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు నిర్వాసితుల జీవితాలను రోడ్డున పడేసిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 769వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఓబీసీ ఉద్యోగులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో ప్రజలంతా ఉగాది పండగను సంతోషంగా జరుపుకొంటుంటే, ఉక్కు కార్మికులు మాత్రం తమ జీవితాల గురించి చింతిస్తూ బాధతో పండగను జరుపుకొంటున్నారన్నారు. 30 ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్‌ను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు ఆ పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని, కార్మికులు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

నేలకొరిగిన అరటి చెట్లు



మిందిలో రైతు అచ్యుతరావు తోటలో నేలకొరిగిన అరటి చెట్లు

అక్కిరెడ్డిపాలెం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల చెట్లు నేలకొరుగుతున్నాయి. 68వ వార్డు మిందిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పరుపుల అచ్యుతరావు అనే రైతుకు చెందిన అరటితోటలో కొన్ని అరటిచెట్లు నేలకొరిగాయి. చేతికంది వచ్చిన అరటి పంట దెబ్బతినడంతో ఆర్థికంగా నష్టపోయానని వాపోయాడు. అరటి తోటనే నమ్ముకుని జీవిస్తున్న తనకు పంట నష్టాన్ని ఇప్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో నీటిని పొదుపుగా వినియోగించాలని స్టీల్‌ప్లాంట్ నీటి నిర్వహణ విభాగాధిపతి రవిశేఖర్ కోరారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద బుధవారం మానవహారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ నీటి బొట్టు ఎంతో విలువైందన్నారు. ప్రతీ విభాగంలో పొదుపు చర్యలు పాటించడం ఆవశ్యకమని, తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో విభాగం అధికారులు ఎం. శ్రీనివాసరావు, నంది, శ్రీనివాస్, సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉక్కు టీటీఐ వద్ద మానవహారం నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఉత్సాహంగా ఉద్యోగుల క్రీడా పోటీలు



పోటాపోటీగా సాగుతున్న వాలీబాల్ పోటీలు



మహిళా ఉద్యోగినుల టగ్ ఆఫ్ వార్

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్స్ ఆవరణలో ఉగాది సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ కంపెనీలు, సంస్థల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల ముగింపు కార్యక్రమంలో కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ వరప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇటువంటి పోటీలు నిర్వహిస్తూ, వారిలో ఉత్సాహాన్ని నింపడం గొప్ప విషయమన్నారు. ఈ పోటీలు శారీరక శ్రమ, మానసిక ఒత్తిడుల నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. లీఫార్మా కంపెనీ డైరెక్టర్ లీలారాణి మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఉత్తేజాన్ని నింపే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వాలీబాల్ విజేతలుగా గ్లాండ్ ఫార్మా, రన్నరప్‌గా సినర్జీస్ జట్లు, నిలవగా, టగ్ ఆఫ్ వార్‌లో మొదటి రెండు స్థానాల్లో లీ ఫార్మా, గ్లాండ్ ఫార్మా కంపెనీల జట్లు నిలిచాయి. కార్యక్రమంలో సినర్జీస్ ప్రతినిధులు నారాయణ, చంచల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ కరువు



గాజువాక మెయిన్ రోడ్‌లో సినిమా హాల్ బస్ షెల్టర్ ప్రాంతం

గాజువాక: గాజువాక మెయిన్ రోడ్‌లో బస్ షెల్టర్లు కరువయ్యాయి. ఈ కారణంగా బస్ ప్రయాణికులు ఎండలోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాతగాజువాక జంక్షన్‌లోని మెయిన్‌రోడ్‌లో గల బస్ షెల్టర్‌ను ఏళ్ల క్రితమే తొలగించారు. ప్రయాణికులు కోరుతున్నా ఇప్పటివరకు పునరుద్ధరించలేదు. అదే రోడ్‌లో సినిమా హాల్ జంక్షన్, కొత్త గాజువాక జంక్షన్‌లోను బస్ షెల్టర్లు లేవు. కనీసం బస్ షెల్టర్ అనే బోర్డులు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేటి నుంచి బొర్రమాంబ పండగ మహోత్సవాలు

అగనంపూడి: అగనంపూడి గ్రామ దేవత బొర్రమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఈ నెల 23న దుర్గాలమ్మ పండగను, 28వ తేదీన పరదేశమ్మ తల్లి పండగను, 30వ తేదీన బొర్రమాంబ ఊళ్లోకి రావడం, ఏప్రిల్ 3న కోటి దీపోత్సవం, 4న బొర్రమాంబ అనుపు మహోత్సవం ఉంటాయని తెలిపారు. ఏప్రిల్ 11న అమ్మవారి మారువారం, 5న బొర్రమాంబ నెల పండగను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మామిడి శ్రీను, నాయుడు, బొరయ్య నాయుడు, కరణం పైడిరాజు, చిత్తా కనకరాజు, బొబ్బరి సూరి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సామాన్యులకు నటనలో శిక్షణ


సీతంపేట: సామాన్యులకు నటనలో శిక్షణ ఇవ్వాలనే సదుద్దేశంతో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించామని డైరెక్టర్ ఎస్.టి.నాయుడు తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద షిర్డీసాయి స్కూల్ ఎదురుగా డాక్టర్ ఎస్.టి.నాయుడు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, డ్యాన్స్ అకాడమీలను బుధవారం ఆయన ప్రారంభించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటనపై ఎంతోమందికి ఆసక్తి ఉన్నా ఆర్థిక స్తోమత లేక చాలా మంది వెనుకంజ వేస్తున్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో నటనలో శిక్షణ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని విశాఖ నగరంలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ సంస్థలో యాక్టింగ్, స్క్రిప్ట్ రైటింగ్, యాంకరింగ్, డైరక్షన్, డ్యాన్స్‌ల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. మూడు నెలలు థియరీ, మరో మూడు నెలలు హైదరాబాద్‌లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణలో ప్రతిభ చూపిన నటీనటులతో సొంతంగా సినిమా నిర్మిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 85558 40515 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ నాయుడు కోరారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ కె.జయలక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాయుడు

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి క్షేత్రంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ యంత్ర మహామేరు ఆలయం ముందు గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమేరు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కలశాలను వేదమంత్రాల సహితంగా ప్రాణ ప్రతిష్ట గావించిన లలితాంబికా అమ్మవారిని భక్తులు తోడ్కొనివచ్చి నవయోని రేఖచిత్రం మధ్యలో ఆశీనులను చేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం , ఖడ్గమాల, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి సహిత బాల హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రేమ్ చందు మీనన్, పూణే నుంచి వచ్చిన పూనం ప్రధాన్, ముంబై నుంచి వచ్చిన అర్చన ఆర్య తోపాటు భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



దేవీపురంలో పూజలు అందుకున్న లలితాంబిక

ఉగాది పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, ఇతర ప్రముఖులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని సీతారామ కల్యాణ మండపంలో పోర్ట్ సాంస్కృతిక సంస్థ సాగరి ఆధ్వర్యంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి పోర్ట్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఆర్.ఎస్.హరికృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోర్ట్ రిటైర్డ్ హిందీ అధికారి పి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పి.ఫ్రాన్సిస్ కవి సమ్మేళనాన్ని నిర్వహించగా.. ప్రముఖ కవి డాక్టర్ కేజీ వేణు సమీక్షించారు. ప్రముఖ వ్యాఖ్యాత పి.అభిషేక్‌ను ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త, పంచాంగ కర్త అడబాల సత్యనారాయణ పంచాంగ పఠనం చేశారు. 40 మంది కవులు, కవయిత్రులు కవితలను వినిపించారు. పోర్ట్ రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ ఆర్ రాములు, సాగరి వైస్ ప్రెసిడెంట్ అవతారం నాయుడు, కార్యదర్శి ధర్మారావు, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, చంద్రరావు, సత్యారావు, సూరిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

పందుల మృత్యువాత

- అంతుచిక్కని కారణం
- ఆందోళనలో పెంపకందారులు
- వైద్య పరీక్షలు చేయిస్తున్న అధికారులు

పెదగంట్యాడ: పందులు అధిక సంఖ్యలో మృత్యువాత పడుతుండడంతో పెంపకందారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కారణం అంతుచిక్కక అటు పశుసంవర్ధక శాఖాధికారులు, ఇటు జీవీఎంసీ ప్రజారోగ్య శాఖాధికారులు వాటికి పరీక్షలు చేయిస్తున్నారు. వీటిని ఎవరైనా చంపేసి గెడ్డల్లో విచ్చలవిడిగా పడేస్తున్నారా? అనే సందేహాలు కూడా ఉన్నాయి. ఇటీవల గెడ్డల్లో, తుప్పల్లో, రోడ్లపై, కాలువల్లో పదుల సంఖ్యలో పందులు విగతజీవులుగా కనిపిస్తున్నాయి. ఏమైనా వైరస్ సోకి మరణిస్తున్నాయా అనే అనుమానంతో అధికారులు పరీక్షలు చేయిస్తున్నారు. మృతి చెందిన పందులకు పోస్టుమార్టం చేయించినా, ఆ నివేదికల్లో వ్యాధులు ఉన్నట్టు తెలియలేదు. వైరస్ సోకి చనిపోతున్నాయోమేనని శాంపిల్స్‌ను పరీక్షించినా ఫలితం లేకపోయింది.

పందులకు వ్యాక్సిన్లు

పెదగంట్యాడ నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రహదారితో పాటు మండలంలోని పలు గెడ్డల్లో ఇటీవల పందుల మృతకళేబరాలు కుళ్లిపోయి ఉంటున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలుతాయేమోనని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ప్రజారోగ్య శాఖాధికారులు గెడ్డల్లో ఉన్న పందుల మృత కళేబరాలను వెలికితీసి, డంపింగ్ యార్డ్ సమీపంలో గోతులు తీసి పూడ్చిపెడుతున్నారు. బతికున్న పందులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్లు వేస్తున్నారు.



పందులకు వ్యాధులు సోకకుండా వ్యాక్సినేషన్ చేస్తున్న అధికారులు



గెడ్డలో పందుల మృత కళేబరాలు

ఆందోళన చెందవద్దు

పందులు మృతి చెందుతున్నాయని ప్రజలు ఎవరూ భయపడవద్దు. పందులకు ఎటువంటి వైరస్ సోకలేదు. అయితే, అవి ఎలా మృత్యువాత పడుతున్నాయో తెలియడం లేదు. వైరస్ సోకకుండా ఉండేందుకు వ్యాక్సిన్లు వేస్తున్నాం. రోడ్లపై, కాలువల్లో మృతి చెందిన పందులను గెడ్డల్లో పడేయవద్దు. వాటిని ఖననం చేసేందుకు డంపింగ్ యార్డ్ సమీపంలో స్థలాన్ని ఏర్పాటు చేశాం. ఆ స్థలంలోకి తీసుకువచ్చి వాటిని పూడ్చిపెట్టాలి.

–డాక్టర్ కిరణ్‌కుమార్, సహాయ ప్రజారోగ్య అధికారి, జీవీఎంసీ జోన్–6